77133

# భార్యలెలా ఉండాలి!



అరిగే రామారావు

"జాగ్రత్త బాబు, అసలే కొత్త కాపురం. నీవు ఆఫీసు అయిపోగానే నేరుగా యింటి కెళ్తా ఉండు. కోడలు అసలే నోట్లో నాలిక లేనిది'—బస్సులో కూర్చున్న మాలక్ష్మమ్మగారు బయట నుంచున్న రామారావుతో అంటూంది.

ఆఫీసు అవగానే యింటి కెళ్లక మధ్యలో పెత్తనాలు ఎందుకు చేస్తాడు తను, అమ్మ పిచ్చిగాని—అసలు ఏ మంత్రంలాంటిదో వుంటే ఆఫీసునుండి ఆ ఒక్క మైలు నడవకుండా కళ్లు మూసుకుని యిక్కడ మాయమై అక్కడ జానకి వళ్లో ప్రత్యక్ష మవడూ! జానకిని చూడని ప్రతి క్షణం తనకు దుర్భరంగా ఉంటుంటేనంట—అమ్మ ఏదో అంటుంది అనుకున్నాడు రామారావు మనసులో.

'విన్నేరా! పెళ్లయినా యింకా ఆ పాడు పరధ్యానం పోలా? వాకు తెలియక అడుగుతానుగానీ అబ్బాయి,యిరవైనాల్గు గంటలూ ఆలోచించినవాడివి ఆ లో చిం చి న ట్లే ఉంటావు. దేన్ని గురించిరా?' మాలక్ష్మమ్మ గారు మందలింపుగా అంది.

'ఆ—ఏమిటి నీవంటావ్?' ఏమీ ఆలోచించకుండా ఎలా ఉండాలో, ఎలా ఉంటారో అర్ధంకాని రామారావు అన్నాడు.

'మీరిద్దరే ఉండగలరా? లేకపోతే అమ్మమ్మను పంపించమంటారా?'

మా మధ్యన ఆ ముసలావిడ ఎందుకు అనుకున్నాడు రామారావు. అనుకుని అన్నాడు 'ఎందుకు అనవసరం. ఉండగలంలే—'

"ఆ గేదె ముండ అలా మారాం చేయక పోతే నేనే ఒక వెల రోజులపాటు ఉందే దాన్ని—"

చిన్న కొడుక్కి క్రొత్తగా పెళ్లయి కాపరం పెట్టుకుంటే ఒక నెల్లాళ్లపాటు మంచి చెడ్డా కనుక్కుంటూ కనిపెట్టు కుందామని వచ్చిన మాలక్ష్మమ్మగారు వచ్చిన మూడోరోజునే ఆవిడగారికే అలవాటయిన గేదె పాలివ్వటంలేదని మాజీవీడు నుండి ఉత్తరం వచ్చేసరికి కొడుకు కొత్త కాపరాన్ని కొడుక్కే అప్పగించి ప్రయాణ మయింది.

పెళ్లయి ఇరవై రోజులు దాటకుండానే క్రొత్త కాపరం పెట్టిన రామారావుకు ఎవరూ లేకుండా తానూ, తన జానకి మాత్రమే ఉండాలని ఉబలాటం. ఉంటే ఎలా ఉంటుందని వూహాగానం. ఈ పెద్దవాళ్లు దగ్గర ఉండి పెత్తనం చెలాయించటం తప్ప మరెందుకూ అనవసరమని అతని అభి

ప్రియం. పైగా, పడుచు దంపతులు స్వేచ్ఛగా, హుషారుగా ఉండటానికి అడ్డు అనుకునే రామారావుకు మూడోనాటికే తల్లి ప్రయాణం అవటం బలే రిలీఫుగా వుంది. యింకో అప్పుడయితే తల్లిని వదలటానికి కళ్లనీళ్లు పెట్టుకునే వాడేమోగానీ యిప్పటి మోజులో తల్లిని సాగనంపటానికి హుషారుగా వచ్చాడు బస్‌స్టాండుకు.

కదలిపోతున్న బస్సు రొదలో తల్లి చివరి హెచ్చరింపు మాటలు కలిసిపోగా రామారావు హుషారుగా జేబులోంచి వక్కపొడి తీసి నోట్లో వేసుకుని రోడ్డుమీదకు వచ్చాడు. ఫుట్ పాత్‌మీద పూల అంగడి కనిపించింది. పావలాపెట్టి పది వందల మల్లెపూలు కొన్నాడు—కొంటూండగా, 'బాబు, వెంకటేశ్వరస్వామి కొండ కెళ్తున్నాం, మీలాంటి ధర్మాత్ముల్ని జోగడుక్కుంటున్నాం' అంటూ వో పళ్లెం ముందుకు వచ్చింది. ఆ జోగి పళ్లెం ఆ బస్‌స్టాండ్ దగ్గర ఆరు నెలలనుండీ అలాగే అడుక్కుంటూందనీ, ఆరు సంవత్సరా లయినా అలాగే అడుక్కుంటుందనీ, ఈ జన్మలో వెంకటేశ్వరస్వామి కొండ కెళ్లదనీ అతనికి బాగా తెలుసు. అయినా ఆ హుషారులో అతను అవేవీ పట్టించుకోలేదు. జేబులోంచి మరొక పావలా తీసి ఆ పళ్లెంలోవేసి ముందుకు సాగాడు.

ప్రక్కనేవున్న దుర్గాభవన్‌లో కాఫీ సగం త్రాగిన తర్వాత, యింటికెళ్తే జానకి కాఫీ యిచ్చేదిగా. యిక్కడ తాగేను ఏమిటనుకున్నాడు. జానకి కాఫీ కప్పు అందించటం, అది అందుకుంటూ ఆమె చేయి పట్టుకుని దగ్గరకు లాక్కోవటం, అలా లాక్కోవటంలో చేతిగాజులు మ్రోగటం—యివన్నీ ఆలోచించుకుంటూ కాఫీ తాగటం పూర్తిచేసి బయటకువచ్చి యింటివేపు దారి తీశాడు.

జానకిచేతికి ఎన్నిగాజులు ఉన్నాయో లెక్కపెట్టాలి. జానకి రెండుచేతులకూ నిండుగా గాజు లేసుకోకుండా ఒక చేతికి వాచీపెట్టుతుంది ఎందుకో? చెప్పాలి... ఆలోచిస్తూ మెల్లగా రోడ్డు పక్కనేవున్న చెట్ల నీడలమాటున నడుచుకుంటూ వెళ్తున్నాడు. జానకి ఒక్కర్తే ఉంటుంది. తొందరగా వెళ్లాలి అని ఆరాటం. కానీ మళ్లీ తొందరగా నడుస్తే యిలా తీయగా ఆలోచించుకోటానికి వీలుండదు — అని ఆలోచన. తొందరగా వెళ్లాలి, మెల్లగా నడవాలి.

ఆలోచనలంటే అంత యిష్టం రామారావుకు. ఆలోచించటంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతాడు. అతని ఆలోచనలూ, భావాలూ, ఎప్పుడూ అతనిలాగా, అతను వేసుకునే బట్టలలాగా, తెల్లగా, వాడకుండా, మృదువుగా ఉంటాయి. గాలిలో తేలిపోతున్నట్లుగా నడుస్తాడు. అతని ఆలోచనలు కూడా ఎక్కడెక్కడికో తేలిపోతూంటాయి. అతని క్రాపు ఎప్పుడైనా చూద్దామన్నా ఒక్క రవ్వకూగాడా చెరిగి ఉండదు. అతని ఆలోచనలూ అంతే. చిక్కుగా, చిరాకుగా, చిందర వందరగా ఉండవు. ఒకవేళ తప్పి జారి ఉన్నవీ అంటే వాటితోపాటే అతని కళ్లల్లో నీళ్లు కూడా ఉంటాయి అన్నమాట. ఒక్క మాటలో చెప్పాలి అంటే అతని మనస్సు. అతని ఆలోచనలు అతనిలాగే అతి సుకుమారంగా ఉంటాయి......అందరూ తనలాగే సుకుమారంగా ఉండాలని అంటాడు. సుకుమారంగా ఆలోచించాలి అంటాడు.

అతడు పార్కు దగ్గరకు వచ్చేసరికి తన కెదురుగా రోడ్డుమీద చెమటలు కక్కుకుంటూ ఒక అందమయిన యువతి సైకిలు త్రొక్కుకుంటూ వస్తోంది. అతను రోజూ ఆఫీసునుండి యింటి కెళ్లే వేళకు ఆ యువతి సైకిలుమీద ఆ పార్కు దగ్గరే ఎదురుపడుతూ ఉంటుంది. చెమటలు కార్చుకుంటూ సైకిలు తొక్కే ఆ యువతిని చూస్తే అతనికి తగని మంట, చిరాకు. ఎంత కాలేజీలో చదువుకుంటూంటేమాత్రం ఆడది అలా మొగరాయుడులాగా చెమటలు కార్చుకుంటూ సైకిలు తొక్కుతుందా. యింత అందమైన అమ్మాయి చక్కగా పుస్తకాలు పట్టుకుని, జడ ముందుకు వేసుకుని, తల వంచుకుని, చెట్ల నీడల క్రింద నడుచుకుంటూ వెళితే ఎంత బాగుంటుంది. చూడటానికి ఎంత ముచ్చటగా ఉంటుంది. ఈ మహాతల్లి ఎవరోగానీ......యిలా రోజూ ఆమె కనిపించినప్పుడెల్లా మనసులో అనుకుంటాడు, విసుక్కుంటాడు. యివాళ ఆ అమ్మాయిని చూడగానే కొంపదీసి జానకి కూడా సైకిలు తొక్కదుకదా అనుకున్నాడు ఛా, ఛా అంత నైస్‌గావుండే జానకి యిలా మోటు పనులు చేస్తుందా అందులో తన భార్య......

కాఫీ యిస్తున్న జానకి చేతినందుకోబోయేసరికి 'పొయ్యిమీద కూర'—అంటూ జారుకుంది. పాపం, రామారావు జావలాగా కుర్చీలోకి జారిపోయాడు. వెధవకూర—వెధవ పొయ్యి అనుకున్నాడు.

మరో అరగంటకు తను తెచ్చిన పది వందల మల్లెపూలల్లో పాతిక పూలను మాత్రమే దండగా కట్టుకుని జడలో పెట్టుకుని వచ్చిన జానకిని చూడగానే రామారావు గతుక్కుమన్నాడు.

'యిదేమిటి, అన్ని పూలు తెస్తే యింత చిన్న చెండే పెట్టుకున్నావు. అవన్నీ ఏవి?' తను తెచ్చిన పూలన్నీ చాపమీద పోసుకుని జానకి దండ గుచ్చుతూవుంటే తను ప్రక్కన కూర్చుని ఒక్కొక్క పూవే ఆమె కందిస్తూ చకచక కదిలే ఆమె సున్నితమైన వేళ్ల కదలికను చూడాలని ఎంతగానో వూహించుకున్న రామారావు నీరసంగా అడిగాడు.

రామారావు అడిగిన దానికి జానకి కిలకిలా నవ్వింది. 'ఆ పూలన్నీ నేను పెట్టుకోటానికేనా? భలేవారే—అవన్నీ పక్కింటి పిన్నిగారి కిచ్చేశాను. నాకీ బుల్లి చెండు చాలు బాబు'— అంది.

రామారావు పెదాలు తడి ఆరాయి. ఆ బుల్లి చెండునే తెచ్చి తన చేతి కివ్వకూడదూ. తన చేతుల్తో ఆమె జడలో తురిమేవాడుకదా. ఆ మిగిలిన పూలన్నింటినీ పక్కింటి పిన్నిగారి కివ్వకపోతే చక్కగా దండకట్టి ఆ రాధాకృష్ణుల మెళ్లో వేయకూడదూ. తను బ్రహ్మచారిగా ఉన్నప్పుడు ఎన్నిసార్లు బజారునుండి పూలు తెచ్చి గుచ్చి ఆ విగ్రహం మెళ్లో దండవేసి అలా చూస్తూ గడిపాడో! ఆ విగ్రహాన్ని చూస్తేనన్నా ఆమెకు తట్టలేదా. పోనీ రాత్రికి మంచంమీదనన్నా చల్లుకోవచ్చునే! మంచంనిండా మల్లె పూలు చల్లుకుని పడుకోవటం తన కెంత సరదా. ఎంత బాగుంటుంది. జానకికి యిది కూడా తెలీదా..... సాలోచనగా, చురుగ్గా రామారావు జానకి వంక చూశాడు.

పెళ్లికిముందు రామారావు ముక్కూమొగం తెలియని జానకి, అతని అభిరుచులూ, ఆలోచనలూ తెలియని జానకి అయోమయంగా చూచింది అతనివంక. యింతలో పక్కింటి పిన్నిగారి కేక నందుకుని వస్తున్నా అంటూ తుర్రుమంది.

రామారావు మడత కుర్చీలో వెనక్కివాలాడు. కిటికీగుండా పక్కింటి డాబా కనబడుతూంది. ఆ డాబా వాళ్లమ్మాయికి పెద్ద జడ ఉంది. ప్రతి శుక్రవారం తలంటుకుని ఉదయం పూట ఎండలో డాబా







# భార్యలెలా ఉండాలి!

మీద సవార్లు చేస్తూ తలారబెట్టుకుంటుంది. పెద్ద జడ అంటే తన కెంత యిష్టమో! పెళ్ళికాకమునుపు పెద్ద జడ ఉన్న పెళ్ళాంమీద ఎన్నో కలలు గన్నాడు. పెళ్ళి చూపుల్లో జానకి జడను చూచి అమ్మయ్య పెద్దదే అనుకున్నాడు. శోభనం మూడోరాత్రి తలంటుకుని వచ్చింది జానకి. 'జడ విప్పేసి జుట్టంతా విరబోసుకో జానకీ' అని తను అడిగాడు. ఎందుకలా చేయమంటున్నాడో అర్థంకాక జానకి మెల్లగా జడనువిప్పి అందులోంచి యింత బారు సవరాన్ని బయటకు తీసి తపామని దులిపి డ్రాయరుమీద పడేసింది. రామారావు కళ్ళు మూసుకున్నాడు. 'నీ కింత చిన్న జడ ఉందేమిటి జానకీ' అని దిగులుగా అడిగాడు. 'మా నాన్న నాకు పన్నెండేళ్ళదాకా క్రాఫు చేయించేవాడు. అందుకని జడ పెరగలేదు'—అంది. సంతోషం అనుకున్నాడు. ఆ రాత్రి వద్దన్నకొద్దీ అతని చూపులు డ్రాయరుమీద పడేసిన సవరం మీదకే పోయాయి. మధ్యలో జానకి చూడకుండా ఆ సవరాన్ని డ్రాయరు వెనక పారేశాడు......

'భోంచేస్తారా?'

రామారావు ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూశాడు.

'అప్పుడే భోజనం ఏమిటి జానకీ? యిప్పుడు టైం ఎంతయింది' అని వాచీ చూశాడు. పావు తక్కువ ఏడు.

'పావు తక్కువ ఏడుకి భోజనం ఏమిటి నా మొగం' అంటూ జానకి కళ్ళలోకి చూశాడు. రామారావుకు జానకి కళ్ళు అంటే అమిత యిష్టం. అసలు వాటికోసమే ఆమెను చేసుకున్నాను అనుకుంటాడు వాటిని చూచినప్పుడల్లా.

'నాకు తొందరగా భోంచేయటం అలవాటు. మా యింటి దగ్గరయితే ఈ పాటికి భోంచేసి స్టడీస్‌కు కూర్చునే దాన్ని. కాలేజీలో గేమ్సు ఆడి యింటికి వస్తూనే కరకర ఆకలి వేసేది'—

'ఏమిటే, నీవు కాలేజీలో గేమ్సు కూడా ఆడేదానివా?'

'మీకు తెలియదు గామాలు, మనం అన్నింటిలో ఫస్టు. సర్టిఫికేట్స్ కూడా ఉన్నాయి. తీసుకురానా' అంటూ లోపలికెళ్ళి యింత కట్ట తెచ్చి రామారావు చేతి కందించింది.

అవన్నీ స్కూల్లోనూ, కాలేజీలోనూ వచ్చిన సర్టిఫికేట్లు. రామారావు ఒక్కటో

క్కొటి చూశాడు. బేడ్‌మింటన్, కోకో, వాకింగ్ రేస్, రన్నింగ్‌రేస్, కబాడీ, సైకిలింగ్.....అన్నింటిలోనూ ఫస్టూ, సెకండూ.

రామారావు తల పట్టుకుని జారగిలబడ్డాడు.

'అదేమిటి, తల పట్టుకున్నారు? తల నొప్పా?' కంగారుగా అడిగింది జానకి.

*    *    *

'యిదిగో జానకీ, బియ్యం పట్టించుకొచ్చాను. ఎక్కడ పెట్టించమంటావు' అంటూ కూలివాడితో సహా వంటింట్లోకి వస్తున్న రామారావును ఉరిమి చూసింది జానకి.

'మీరు బూట్లతో వంటింట్లోకి వస్తున్నది చాలక అతన్ని కూడా లోపలకు తీసుకుని వస్తున్నారే. అక్కడ సావిట్లో పెట్టించి వాణ్ని పంపించండి' అంది జానకి.

'అదికాదు, మళ్లీ ఆ మూట లోపలి కెలా వస్తుంది?'

'కాళ్లతో నడుచుకుంటూ వస్తుంది'—పకపక నవ్వుతూ, 'అలా చూస్తారేమిటి? మనం లోపల పెట్టుకోలేమా' అంది.

అవును పెట్టుకోవచ్చు అనుకున్నాడు మనసులో. కూలివాడికి డబ్బులిచ్చి పంపించేశాడు. జానకి వంటింట్లోకి వెళ్లింది. రామారావు బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని వచ్చాడు. లుంగీని పయికి కట్టుకుంటూ సావిట్లో మూలనవున్న ఆ పావు మూట బియ్యం బస్తా వంక అన్ని వయిపుల్నుంచి చూశాడు. దగ్గరకెళ్లి ఒక చేత్తో ఎత్తబోయాడు. ఉహూ, కదల్లేదు. రెండు చేతులతో పట్టుకుని ఎత్తాడు. కొద్దిగా కదిలింది. అలా పట్టుకుని వెనక్కి వెనక్కి వస్తున్నాడు. వెనకాల నవ్వు. జానకి పకపకా నవ్వుతూ నిల్చుంది.

'చాల కష్టపడుతున్నారుగానీ లేవండి—' అంటూ రామారావును పక్కకు నెట్టి ఆపావు మూటను అవలీలగా ఎత్తి వంటింట్లోకి తీసుకు వెళ్లింది. తను ఎత్తలేని మూటను అవలీలగా తీసికెళ్తున్న భార్యవంక కళ్లప్పగించి చూశాడు రామారావు. గబ గబ బెడ్ రూంలోకి వెళ్లాడు. డ్రాయర్లో పెట్టిన సర్టిఫికేట్లని బయటికితీసి తొందర తొందరగా ఒక్కొటొక్కొటి చూశాడు......వెయిట్ లిఫ్టింగ్‌లో ఫస్టు! వాటిని అక్కడ పడేసి స్టాండ్‌మీదవున్న టవల్ తీసుకుని చెమట తుడుచుకున్నాడు. సిగరెట్టు ముట్టించి కిటికీ దగ్గర నిలబడ్డాడు. సిగరెట్టుదమ్ము లాగుతూ పళ్లు పట పట కొరికాడు. 'ఛీ, యింతమోటుదేమిటి జానకి'—అనుకున్నాడు.

ఎదురింటి ప్లీడరుగారి బావమరది లంగోటి కట్టుకుని బస్కీలుతీస్తూ కనిపించాడు. బస్కీలు ఆపి పక్కనేవున్న యినపగుండ్లు ఎత్తాడు. ఆ తర్వాత చేతి కండరాలను ఉబ్బిస్తూ కండలను చూచుకుని మురుస్తున్నాడు.

'పనీ పాటా లేకుండా బావగారి సొమ్ము తేరగా తింటూ కండలు పెంచుతున్నాడు, రాస్కెల్!' అని తిట్టుకున్నాడు రామారావు. పదహారేళ్ల ఆ వస్తాదును చూస్తే పీలగా, బక్కపలచగా ఉండే రామారావుకు వళ్లు మంట.దభాలుమని కిటికీ తలుపులు మూసేసి వచ్చి మంచంమీద పడుకున్నాడు.

ఆ మర్నాడు ఆదివారం—


జానకి వంట చేస్తూవుంటే వంటింట్లో కెళ్లి 'ఈ రోజు మనిద్దరం కలసి ఛేద్దాం జానకీ' అని నాలుగోసారిగా చెప్పాడు రామారావు.

'ఛేం చెద్దాం లెండి బాబూ! సరే వస్తా నుగా, యిన్నిసార్లు చెప్పాలేంటి? మీరెళ్లి పేపరు చదువుతూ కూర్చోండి. వంటైన తర్వాత నేను పిలుస్తాను. మధ్య మధ్య వచ్చి నా వంట పాడు చేయకండి' అని జానకి విసుక్కునేటప్పటికి పాపం రామారావు చిన్న బుచ్చుకుని బయటికొచ్చాడు.

తన కిష్టమయిన మడతకుర్చీలో పడుకుని తీయటి పగటికల కన్నాడు......జానకీ, తనూ భోజనానికి కూర్చుంటారు. జానకి తనకు అన్నం ముద్దలు తినిపిస్తుంది. తను తింటానికి మారాం చేస్తాడు. నా బుజ్జిబాబుకదూ! తినండీ, అంటుంది. యిది దేవుడి ముద్ద, యిది నా ముద్ద, యిది మీ ముద్ద, యిది మీ అమ్మగారి ముద్ద అంటూ తన చేత ముద్దలు తినిపిస్తుంది. జానకి తినే పిట్ట మెతుకులు చూచి తను నవ్వుతాడు. యింకొస్త తిను, యింకొస్త తిను అని బలవంతం చేస్తాడు. తినకపోతే నామీద ఒట్టే అంటాడు......

యిది పగటి కలే కానక్కర్లేదు. నిజానికి యిలా జరగటం చాల సహజం. క్రొత్తగా పెళ్లయిన దంపతులకు అనుభవంలోని విషయమే......కానీ భోజనాల దగ్గర తన పక్కనే కూర్చుని తన పాటికి తాను అన్నం తింటున్న జానకిని చూచేసరికి రామారావుకు యిది పగటి కలే అనిపించింది.

'ఆ బెండకాయ కూర మీకు వద్దా?' అని అడిగి తను వద్దనేసరికి అయితే యిలా యివ్వండి అని తను వడ్డించుకుని గబ గబ తింటున్న జానకివైపు చుర చుర చూశాడు. తను వద్దంటే బ్రతిమిలాడి తినిపిస్తుంది.




# మీ జుత్తును ఆరోగ్యంగా నిగనిగ లాడేలాగు వుంచుతుంది

# బ్రిల్‌క్రీమ్

సర్వోత్తమ హేర్-డ్రెస్సింగ్






కేవలం బ్రిల్‌క్రీమ్ మాత్రమే

- చక్కగా జుత్తు దువ్వుకొనడానికి సాయపడుతుంది. జుత్తు జిడ్డు కాదు. చెదరి పోదు.
- చాలా పొదుపు అయినది. ఒక్కసారి రాస్తే చాలు రోజంతా జుత్తు రేగదు.
- దీనిలో చేర్చిన అద్వితీయమైన మిశ్రమము మాడును పోషించి, జుత్తును బాగా పెంచుతుంది.
- మీ జుత్తు యొక్క సహజ రంగును బయలు పరచును.

**మీరు కూడా బ్రిల్‌క్రీమ్ ఉపయోగించడం మొదలు పెట్టండి**

ప్రపంచమంతటా లక్షలాది మంది సొగసుకారులు ఉపయోగించేది.

BIP111PL1165

అనుకున్నాడు. కానీ అదేం జరగలేదు. అలాగే జానకి కంచంలో పెట్టుకున్న అన్నం కూడా పిట్ట మెతుకులేం కావు. తన కంచంలోని అన్నానికి రెట్టింపు. రోజూ జానకి యింత అన్నం తింటుందా అని ఆశ్చర్య పోయాడు. కంచంలోని అన్నం అంతా కూరలతో అయిపోగా పెరుగులోకి మళ్లీ మారు పెట్టుకున్న జానకిని చూసి, ఛీ యిదేమి ఆడదిరా బాబూ, యింత అన్నం తింటుంది అని మనసులో చిరాకు పడ్డాడు. ఆడవాళ్లు నాజూకుగా మగవాళ్లకన్నా అన్నం తక్కువ తినాలనీ, అలా తినని వాళ్లంతా రాక్షస జాతి క్రిందకు వస్తారనీ రామారావు ఉద్దేశ్యం. మామూలుగా రోజూ తినే దానికంటే కూడా తక్కువగా తిని భోజనం అయిందనిపించుకుని బయటికి వచ్చాడు.

ఇక జానకితోపాటు ఎప్పటికీ భోజనం చేయకూడదని నిశ్చయించుకున్నాడు—భోజనాల సన్నివేశాన్ని ఎంతో మధురంగా వూహించుకుని, వాస్తవికంలో దెబ్బతిన్న రామారావు.

ఆ తర్వాత ఒక సంఘటన జరిగింది.

రాత్రిళ్లు వంటింటి పెత్తనం చెలాయిస్తున్న ఎలుకలను పట్టటానికని పెట్టిన బోనులో తెల్లారేటప్పటికి ఒక పందికొక్కు కూర్చొనివుంది. బోనులో గిలగిల్లాడుతున్న పందికొక్కును చూచేసరికి రామారావుకు దానిమీదఎక్కడలేని జాలిముంచుకొచ్చింది. 'పాపం!' అనుకున్నాడు. దాన్నేమి చేయాలో తోచలేదు. జానకిని అడిగాడు. 'నాకేం తెలుసు అంది.' ఏం చేయాలా అని రామారావు కాస్సేపు సీరియస్‌గా ఆలోచించాడు. గబ గబా లోపలకు వెళ్లి చొక్కా వేసుకు వచ్చాడు. ఎక్కడికీ అంది జానకి. 'దీన్ని రిక్షాల్లో తీసుకువెళ్లి వూరిబయట పొలాల్లో విడిచివస్తాను'—అన్నాడు. 'వూరికనే రిక్షాలో తీసికెళ్తారా లేక మేళ తాళాలు పెట్టిస్తారా' అని జానకి నవ్వుతూ అడిగిన దానికి రామారావు అయోమయంగా చూశాడు ఆమె వంక.

'అలా చూస్తారేమిటండీ? బోనులో పడ్డ పందికొక్కును ఏం చేస్తారో ఆమాత్రం తెలియదటండీ? రిక్షాలో తీసి కెళ్తామని బయలు దేరారు—'

'తెలియకేగా విన్నడిగాను?' అమాయకంగా అన్నాడు రామారావు.


'అయితే, యిలా చూడండి. ఏం చేయాలో' అంటూ లోపలి కెళ్లి ఒక గోనె సంచి తెచ్చింది. 'అదెందుకు' అని అడిగాడు.


'కాస్త ఆగండి, చూద్దురుగాని' అని బోనులోని పందికొక్కును మెల్లగా గోనెలోకి వదలి గోనె సంచి మూతి బిగించి కట్టింది. లోపల పందికొక్కుకు వూపిరాడక గిలగిల కొట్టుకుంటోంది. జానకి లోపలకు వెళ్లి రోకలిబండ తీసుకొచ్చింది. గోనె సంచీలోని పందికొక్కు గిలగిలా తన్నుకోవటం చూసేసరికి కళ్లనీళ్ల పర్యంతమయిన రామారావు జానకి చేతిలోని రోకలి బండను చూసి అదెందుకూ అనడిగాడు.

'యిందుకూ' అంటూ గోనెలోని పందికొక్కును నాలుగు ఉతుకులు ఉతికింది. పందికొక్కు కాస్సేపు గిలగిలా కొట్టుకుని ప్రాణాలు వదిలింది. జానకి గోనె సంచి మూతివిప్పి క్రిందకు దులపింది. చచ్చిన పందికొక్కు తప్మని క్రింద పడింది. దాని తోక పట్టుకుని ఎత్తి 'యిదుగో, మీ ఫ్రెండు' అంటూ రామారావుకు చూపించింది. రోకలి బండ దెబ్బకు పందికొక్కు మూతంతా చితికి ఎర్రటి రక్తం బొట్లుగా కారుతోంది. ఈ దృశ్యం చూచేసరికి రామారావు గుండె కొట్టుకోవటం ఒక్క క్షణంసేపు ఆగిపోయింది. కోపంతో ముఖం ఎర్రబడింది. చచ్చిన పందికొక్కును తోక పట్టుకుని గోడవతల పడవేసి చేతులు కడుక్కుంటున్న జానకిని చూసి, 'యిప్పుడు నీవు చేసిన పనేమిటి, చెప్పు' అని పిచ్చి ఆవేశంతో రామారావు అరచిన అరపుకు జానకి తెల్లబోయి అతనివేపుచూస్తూ, 'ఏముంది, పందికొక్కును చంపాను' అంది.

'అదే, చంపటానికి నీ చేతు లెలా వచ్చాయి అంటున్నా. అసలు నీవు మనిషివేనా? ఆడదానివేనా? నోరు వాయి లేని ఆ అమాయక ప్రాణిని ఎంత ఘోరంగా చంపావ్—' కోపంతో మాటలు తడబడ్డాయి. ఆ ఆవేశంలో తనేమి అంటున్నాడో తనకే తెలియలేదు. 'యింత కసాయి గుండె ఆడవాళ్లను అసలు నమ్మకూడదు. యిప్పుడు దీన్ని చంపటానికి వెనకాడని దానవు రేపు యింకా ఎంత ఘోరమైన పనులైనా చేయగలవు. ఈవాళ ఈ పందికొక్కు అయింది. రేపు నేనవుతానేమో..... జానకీ, నిన్ను..... ఛీ, ఛీ.....' అంటూ అసహ్యంగా జానకి వంక చూసి గబ గబా బయట కెళ్లిపోయాడు. అలా అన్ని మాటలని కోపంగా బయటి కెళ్లుతున్న రామారావు వంక ప్రాన్పడి చూస్తూ ఉండిపోయింది జానకి.

ఆరోజంతా రామారావు అన్న మాటలే జానకి చెవుల్లో రింగుమంటున్నాయి. ఆ పూట ఎలాగో వంట ముగించింది. కానీ బయటకు వెళ్లిన రామారావు మళ్లీ రాత్రి పదింటిదాకా యింటికి రాలేదు. వండిన వంటంతా అలానే ఉండిపోయింది. జానకి ఏడుస్తూ గదిలో పడుకుంది. ఎందుకు వారన్ని మాటలన్నారు. అసలు వారేనా అన్ని మాట లన్నది. తనేం చేసింది. పందికొక్కును చంపింది. అంతేగా. దానికి నోరు పట్టని మాట లనాలా. ఆయన్ని నేన



దంపటమేమిటి......ఎంత ఆపుకుందామన్నా జానకికి కన్నీళ్లు ఆగలేదు. కుమిలి కుమిలి ఏడ్చింది.

*   *   *

రెగ్యులేటరు బ్రిడ్జిమీద నుంచుని ఎగి రెగిరి పడుతున్న అలల వంకే తదేకంగా చూస్తూ పరధ్యానంగావున్న రామారావు తన ప్రక్కనే కిల కిలా నవ్వులు వినిపించి వెనక్కి తిరిగి చూశాడు. యిద్దరు అందమైన యువతీ యువకులు చెట్టా పట్టా లేసుకుని సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వు కుంటూ వెళ్తున్నారు. వాళ్లని చూస్తే ముచ్చటేసింది అతనికి. కొత్త జంట కాబోలు అనుకున్నాడు. వో నిట్టూర్పు వదలి మెల్లిగా కదిలాడు. అక్కడినుండి. మన సులో ఏదో చెప్పరాని వెలితి, ఏదో చెప్పరాని బాధ.

పక్కనున్న పార్కులోకొచ్చి గడ్డినేలమీద కూలబడ్డాడు. గడ్డిపరకలు ఒక్కటొక్కటే తెంపి నోట్లో పెట్టుకుని కొరుకు తున్నాడు. 'అబ్బ, యిక నేను నడువలేను బాబూ'— మాటలు వినిపించి వెనక్కి చూశాడు. వో జంట—లేతగా, పల్చగా, అతి సుకుమారంగావున్న వో జంట. ఆ అమ్మాయి అక్కడే గడ్డిమీద కూర్చుంది బుంగమూతి పెట్టి. 'ఓస్ వో ఫర్లాంగు దూరం కూడా నడవలేదుకదా. అప్పుడే అలుపా. ఎంత సుకుమారివే చిన్నదానా'—ఏదో కవిత్వం పలుకుతున్నాడు, ఆ అబ్బాయి ఆమె కళ్ల ల్లోకి చూసి నవ్వుతూ. 'ఫర్లాంగు దూర మంటే మాటలా ఏమిటి. మీకేం, మీరు మగాళ్లు. ఎన్నయినా చెప్తారు. మేం మీలాగా మోటుగా ఉండలేముగా' అంటోంది ఆమె.

పిచ్చిది. తాను సుకుమారంగా ఉన్నంత మాత్రాన యిక లోకంలో ఆడవాళ్లం దరూ అలాగే ఉంటారనుకుంటోంది.

# భార్య లెలా ఉండాలి!


పాపం. దానిని చూస్తే తెలుస్తుంది. ఆడాళ్లు అబలలో, సబలలో. ఒక ఫర్లాం గేమిటి ఖర్మ, ఆరు మైళ్లు నడవమన్నా నడుస్తుంది. వాకింగ్ రేస్ ఛాంపియనాయిరి మరి! ఒక్కర్తే నడవటంకాదు. నాకు కాళ్లు లాగి నడవలేకపోతే నన్ను కూడా అవలీలగా కుర్రాడ్ని ఎత్తుకున్నట్టు అలా భుజంమీద వేసుకుని మరీ నడవగలదు సునాయాసంగా. వెయిట్ లిఫ్టింగ్ కూడా ఉందిగా వో బోడి క్వాలిఫికేషను. అయినా, ఆ అబ్బాయి అదృష్టవంతుడు. చక్కటి అందమైన, సుకుమారమైన భార్య దొరి కింది. అలసిపోయిన భార్యను చేతుల్లోకి తీసుకుని ఆమె కళ్లల్లోకి చూస్తూ, నవ్వుతూ, వోదార్చగల అదృష్టం.. ప్చ్! ...నిజంగా, అతను అదృష్టవంతుడు. అందరికీ అలాంటి భాగ్యం అబ్బుతుందా?

వెనకనుండీ ఒకటే గుసగుసలూ, కిల కిలలూ— మండుకొచ్చింది రామారావుకు. ఎంత దంపతులయితే మాత్రం ప్రపంచా నికి చాటుకోవాలా తాము సరసాలాడు కుంటున్నామని. ఆ సరసాలాడుకునే దేదో యింట్లో గుట్టుగా ఆడుకోరాదూ—

అయినా ఈ వయసులో సరసాలకు యింటా బయటా అన్న హద్దు ఎక్కడిది. అదృష్టవంతులు కాబట్టి అలా ఎప్పుడూ ఆనందంగా ఉంటున్నారు. మరి అందరూ తనలాంటి దౌర్భాగ్యులే ఉంటారా. బయట కాదు, యింట్లో కూడా తనకు ఆనందం లేదు. పొద్దుట లేచినప్పటినుండీ యింటి పనీ, వంటా వార్పూ— ఒక్క క్షణం తీరిగ్గా కూర్చుని సర్దాగా కబుర్లు చెప్పిన పాపాన పోయిందా. ఏం, రెండొందలు సంపా దిస్తున్నానుకదా. డబ్బు కొదవ కూడా లేదే. ఒక పనిమనిషిని పెట్టుకుంటే హాయిగా ఉండవచ్చుగదా. ఈమాత్రందానికి పని మనిషి కూడా ఎందుకూ అని తిప్పు కుంటూ చెబుతుంది. సాయంత్రం ఆఫీసు నుండి యింటి కెళ్లేసరికి పొయ్యిమీద కూరా—పక్కింటి పిన్నీ తయారు. లేకుంటే యిల్లు సర్దటం వగైరాలు ఉండనే ఉన్నా యిగా. అలసిపోయి యింటికొస్తే చిరు నవ్వుతో ఎదురొచ్చి, గుండెలమీద వాలి పోయి—అబ్బ, ఎంత సేపట్నించీ మీ కోసం కాచుక్కూచున్నాననుకున్నారు. ఎదురు చూచి చూచి కళ్ళు కాయలు కాచి పోయినయ్—అంటూ యింకా.....ఓహ్. ఏం లాభం. అలాంటి అనుభవాలన్నీ నాకు పగటి కలల్లోనే అంతమయినాయి. నా. ఖర్మకొద్దీ నాకు ఒక అందమైన పహిల్వాను దొరికింది. వో మాటా, మంచీ, ముద్దూ, ముచ్చటా ఏమీలేదు.....ఎప్పుడో అర్ధరాత్రికి—పూరు మాటు మణిగింతర్వాత—ఛ, ఛ, ఏమిటో ఈ బ్రతుక్కి అర్ధమంటూ లేకుండా పోతోంది. నా గాలిమేడలన్నీ కూల్చేసింది—తాటకి!

రాక్షస జాతికి చెందింది కాకపోతే అంత అన్నం తింటుందా. నిర్భయంగా అలా పందికొక్కును చంపుతుందా! అబ్బ, ఆ దృశ్యం తల్చుకుంటే నాకు యిప్పటికీ వళ్ళు జలదరిస్తుందే. ఎంత రాక్షసత్వం లేకపోతే అంత నిర్దాక్షిణ్యంగా పంది కొక్కును చంపేయగలదు. ఛీ, ఛీ, అది ఆడదికాదు—

సుకుమారమైన భావాలూ, సున్నిత మైన మనస్తత్వం గల భార్యకోసం ఎంతగా కలలు కన్నానో అంత మోటు మనిషి దొరికింది నా ఖర్మ కొద్దీ. అందం చూసి మోసపోయాను. అయినా యిప్పుడేమనుకుని ఏం లాభంలే. ఏదో నా అదృష్టంకొద్దీ ఆమె



తత్వం మారితే మారాలి. లేదా యిక యింతే. జీవితమంతా యిలాగే గడిపేయాలి. తప్పదు..

బరువుగా నిట్టూరుస్తూ లేచి పార్కు బయటకొచ్చి యింటిదారి పట్టాడు.

*　　*　　*

ఎనిమిదిన్నరయింది. యింకా రాలేదు—అనుకుంటూ అలమరులోనున్న ఫ్లాస్కు వంక చూచింది జానకి. తన కోసమని స్పెషల్‌గా స్ట్రాంగ్ డికాక్షన్‌వేసి తయారు చేశాను. ఐదింటింకే. యింటికొస్తేనా యివ్వటానికి—అనుకుని దిగులుగా నిట్టూర్చింది.

ఏమిటో ఈమధ్య మరీ రెక్‌లెస్‌గా ఉంటున్నారు. నాలుగున్నరకల్లా యింటికి వరిగెట్టుకుని వచ్చే మనిషి యిప్పుడు రాత్రి తొమ్మిదయినా యింటికి రావటంలేదు. ఆ రావటం కూడా మొహం నిండా గాంభీర్యం పులుముకుని వస్తారు. మాట్లాడకుండా మడత కుర్చీలో పడుకుని కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంటారు సిగరెట్టుమీద సిగరెట్టు తగలేస్తూ. పదిసార్లు పిలిచిం తర్వాత బుద్ధి పుట్టింరోజు కాస్త ఎంగిలి పడతారు. లేకపోతే అదీ లేదు. యిదివరకల్లా యింట్లో ఉన్నంతసేపూ నా వెంట వెంట తిరుగుతూ కబుర్లు చెబుతూ ఎప్పుడూ ఏదో ఒక చిలిపి పని చేస్తూండే మనిషి యిప్పుడిలా ఎందుకు మారిపోయారో అర్థం గాకుండా ఉంది.

మొదట్లో ఎంత ప్రేమగా ఉండేవారు నేనంటే. ఆ ప్రేమని చూచి నా బోటి అదృష్టవంతురాలు యిక ఎవ్వరూ ఉండరనుకుని ఎంతగానో మురిసిపోయాను. హృదయపూర్వకంగా ప్రేమించే భర్తను పొందగలిగాను. యిక నాకేమీ అక్కర్లేదు—అని ఎంతగానో తృప్తిపడ్డాను. జీవితమంతా యిలాగే పచ్చగా గడిపేయాలి అని ఎంతగానో కలలు గన్నాను. వారే నా సర్వస్వమనుకుని పూజిస్తున్నాను. వారిని సంతోష పెట్టాలని నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను.....

నేను ఏం తప్పు చేశానని నన్ను వారు ఈవిధంగా శిక్షిస్తున్నారో అర్థంగాకుండా వుంది. పోనీ ఏదైనా తెలీక పొరబాటు చేసి వుంటే మందలించవచ్చుగదా. తనకి నామీద సర్వాధికారాలూ ఉన్నాయే. నీవు ఫలానా తప్పు చేశావు అని చెప్పి శిక్షిస్తే సంతోషంగా అనుభవించటానికి సిద్ధంగా ఉన్నానే. నావల్ల పొరబాటవుతే ఎందుకు చెప్పకూడదు నాతో. ఈ విధమైన మూగ శిక్ష నేను భరించలేకుండా ఉన్నాను. కనిపెంచిన తలిదండ్రులనీ, అయినవాళ్లనీ అందర్నీ వదలి వచ్చి తనమీదే నా ఆశలన్నీ పెట్టుకుని బ్రతుకుతున్నానే. పలకరించే దిక్కులేక యిలా వంటరిగా పగలల్లా బిక్కు బిక్కుమంటూ గడపాలి. సాయంత్రంనుండీ తన కోసం కళ్లల్లో వత్తులు పెట్టుకుని ఎదురు చూస్తూ కూర్చున్నా, వూరు మాటు మణిగే వరకూ యింటికి రారు. వచ్చింతర్వాత కూడా వో పలకరింపూ, మాటా, మంచీ ఏమీ లేదు. అబ్బా, ఈ బాధ భరించలేకుండా ఉన్నాను. హయ్యో భగవంతుడా.....

ముందుగదిలో బల్లముందు కుర్చీలో కూర్చుని యిలాంటి ఆలోచనల్తో నలిగిపోతున్న జానకి బాధ భరించలేక తలని బల్లమీదేసి బాదుకుని కుమిలి కుమిలి ఏడుస్తూ కూర్చుండిపోయింది.

*　　*　　*

'అప్పుడేమో అత్తగారి జబ్బు మూలంగా దాని పెళ్లికి వెళ్లలేకనే పోయాను. యిప్పుడయినా వో రెండు రోజులుండి దాని కొత్త కాపరం ఎలా ఉందో చూద్దా'మనుకుని విజయవాడలో మకాం వేసింది జానకి పిన్ని కూతురు కమల. కమల జానకికన్నా ఐదారేండ్లు పెద్దది. బి. యే. పాసయింది. నాలుగేండ్ల క్రితం పెళ్లయిన ఆమె యిప్పుడిద్దరు పిల్లల తల్లి. జానకి కమల యిద్దరూ ఎంతో స్నేహంగా ఉంటారు. వాళ్లిద్దరిమధ్యా ఎలాంటి అరమరికలూ లేవు.

చెల్లెలి కొత్త కాపురం చూద్దామని వచ్చిన కమల జానకి కాపరంలో ఏవో కలత లున్నాయని గ్రహించింది. వాళ్లిద్దరూ కొత్తగా పెళ్లయిన యువ దంపతు లుండవలసినంత హుషారుగా, దగ్గరగా ఉండటం లేదనీ, ఎడ మొగం పెడమొగంగా ఉంటున్నారనీ పసికట్టింది. కారణం అంతు పట్ట లేదు.


వో రోజున జడవేస్తూ మెల్లగా 'ఏమిటే విషయం' అంటూ జానకిని కదిపి చూచింది. జానకి మొదట్లో ఏమీలేదని నసిగింది. 'ఏమీ లేకపోవటమేమిటి నీ మొహం. ఏదో ఉందిలే చెప్పు' అని బలవంతం చేసేసరికి జానకికి దుఃఖం ఆపుకుందామన్నా ఆగలేదు. కమలను కౌగలించుకుని భోరున ఏడ్చింది.

జానకిని అనునయిస్తూ అసలు విషయమేమిటో చెప్పు అని అడిగింది కమల. జానకి కళ్లు తుడుచుకుంటూ 'అసలు విషయం తెలీకనే యింత బాధ పడుతున్నాను. ఏమీ కారణం లేకుండానే ఉన్నట్టుండి మారిపోయారు'—అంది.


'నీవంటే యిష్టంగా ఉండదా? యింకెవరైనా ఉన్నారేమిటి కొంపదీసి!'

'అబ్బే అలాంటి దేమీ లేదు. మొదట్లో నన్ను ఎంతగానో ప్రేమగా చూచుకునే వారు. చెడు తిరుగుళ్లు అలాంటి వేమీ లేవు—'

మనిషిని చూస్తే మంచి వాడులా కనిపిస్తాడు. చాలా సున్నితమైన హృదయం కలవాడని యిదే చెబుతూంది. మరి అలాంటి వాడు యింత క్రూరంగా ఎందుకు ప్రవర్తిస్తాడు. ఏదో బలమయిన కారణం ఉండి ఉండాలి. అతని మనస్సు తెలుసుకోలేక



పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17







# భార్యలెలా ఉండాలి!

యిది బాధ పడుతూంది. అనిపించింది కమలకు.

'కొత్తగా కాపరానికి వచ్చిం తర్వాత రోజూ ఏమేమి చేసేవారో అంతా చెప్పు. నేను కనుక్కుంటాను కారణం. చిన్న చిన్న వివరాలతో సహా చెప్పాలి.....అబ్బే అలా సిగ్గుపడితే లాభంలేదు. నా దగ్గర సిగ్గేమిటి నీకు. చెప్పు మరి' అని గుచ్చి గుచ్చి అడిగి వివరాలు తెలుసుకుంది కమల.

* * *

'......దాన్ని చంపి గోడవతల పారేశాను. యిక అంతమాత్రానికే నేనేదో మహా రాక్షసకార్యం చేసినట్లు నన్ను నానా మాటలూ అన్నారు. వారు అంత కఠినంగా మాట్లాడటం అదే మొదటిసారి. ఆ మాత్రం చిన్న విషయానికి అంతలేసి పెద్ద పెద్ద మాట లనాల్సిన అవసరమేమిటో నాకు బోధపడలేదు. యిక ఆ తర్వాత రోజు రోజుకీ ఎక్కువయిపోయింది. ఆయన విరసభావం. అక్కడికే సిగ్గువిడిచి ఒక రోజున అడుక్కున్నాను—నా తప్పేమైనా వుంటే చెప్పండి. సరిదిద్దుకుంటాను—అని. ఏమీ మాట్లాడకుండా నన్నొక పురుగును చూచినట్లు అసహ్యంగా చూచి నీకేమీ అర్థం కాదులే అంటూ వెళ్ళిపోయారు. రోజూ ఒక నరకంలా ఉంది. ఈ బాధ యిక నేను భరించలేనే' అంటూ చేతుల్లో మొహం దాచుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది దానకి.

జానకి చెప్పిందంతా విన్న కమలకు అసలు విషయ మేమిటో తెలిసినట్లనిపించింది. కాస్సేపు ఆలోచించి 'ఆ. అంతే అయ్యుండాలి' అనుకుంది. ఏడుస్తున్న జానకిని దగ్గరకు తీసుకుని 'అయ్యో పిచ్చిపిల్లా! ఛ, ఏడవకూడదు. వూరుకో. ధైర్యంగా ఉండాలి' అని నోదార్చుతూ ఈ గొడవ కంతటికీ కారణ మేమిటో చెప్పమంటావా' అవడిగింది.

ఎక్కిళ్ళతోకి దిగిన ఏడ్పుతో కళ్ళు తుడుచుకుంటూ ఏమిటన్నట్టుగా కమల వంక చూచింది జానకి.

'చూడబోతుంటె నీ భర్తకు హాయి టిక్ టెంపర్‌మెంట్ జాస్తిగా ఉన్నట్టుంది. భావుకుడు. మనిషి ఎంత సుకుమారంగా ఉన్నాడో భావాలు అంతకన్నా సుకుమారంగా ఉన్నాయన్నమాట. మోటు పనులు అతనికి సయించవులావుంది. నీవు అతను ఆశించినంత సుకుమారంగా ఉండటంలేదు. అతను చేయలేని పనుల్ని కూడా నీవు చేయ గలుగుతున్నావు. అతనికి లేని ఛాంపియన్‌షిప్ సర్టిఫికేట్లు నీకున్నాయి. యింట్లో న్యూసెన్సుగావున్న పందికొక్కును చంపటం అందరి యిండ్లల్లోనూ జరిగే సామాన్యమైన విషయమే. కానీ అతని భావుక హృదయానికి అది నచ్చలేదు. మెత్తని మనస్సు కాబట్టి ఆ పందికొక్కు రక్తం చూచేసరికి నీమీద అసహ్యం కలిగింది. చూడూ, భార్యా భర్తలలో భరించేవాడు భర్త గాబట్టి వాళ్ళ ఆధిక్యతను మనం గుర్తించాలని వాళ్ళు కోరటం సహజం. తనతో సమానంగా ఆడది కూడా ఉన్నప్పుడు యిక తన ఆధిక్యత ఎక్కడుంటుంది. ఆడవాళ్ళకు సమాన హక్కులివ్వాలనీ, పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యా లివ్వాలనీ మగవాళ్ళు వేదికలెక్కి ఎన్ని ఉపన్యాసాలిచ్చినా, పత్రికలలో ఎన్ని వ్యాసాలు రాసినా నిజ జీవితంలో తమ భార్య తమ కన్నా ఎక్కువ స్థితిలోవుంటే ఏ పురుషుడూ సహించడు. అది వాళ్ళ ప్రకృతి. ఫారిన్ కంట్రీస్‌లో ఆడాళ్ళూ మగాళ్ళూ అలా సమానంగా ఉంటారేమో. కానీ ఈ దేశంలో అలా కాదు. ఆడదంటే సున్నితత్వానికీ, సౌకుమార్యానికీ మారుపేరులాగా ఉండటమే మన దేశంలో ఆచారం. అందుకు భిన్నంగా ఉన్నందువల్ల కేవలం సంసారాలలో యిలా గొడవలు తెచ్చుకోవటం తప్ప మరేమీ ప్రయోజనం ఉండబోదు. నీవేమో ప్రతి విషయంలోనూ అతనికి హెచ్చు స్థాయి ఎక్కువలోనే ఉన్నావు. అది అతను సహించలేకపోతున్నాడు. నీకు అతనికన్నా ఎక్కువ శక్తి సామర్థ్యాలుంటే వాటికిని బయటికి కన్పించనీయకుండానే అతనికి సాయం చేయాలి. అంతేకానీ, నీ కన్నా అతను తక్కువగా ఫీలయ్యేట్లు నీవు ప్రవర్తించరాదు. కాబట్టి, హే కింగ్‌కాంగ్ చెల్లెలా! నీవు కాస్త మారాలి. ఏడు మల్లె పూవుల ఎత్తు కూడా తూగని రాజకుమారిలాగా నాజూకుగా ఉండు కొన్నాళ్ళపాటు. నీదేంపోయింది. నీ నాజూకు తనానికి కాస్త భావుకతను కూడా జోడించు. అతను కుర్చీలో పడుకుని కలలుకంటే నీవు నడుస్తూనే కను—ఏమిటే....కలలు!'' అంటూ నలహాయిస్తున్న కమలను నోరు తెరచుకుని చూస్తూ కూర్చుండిపోయింది జానకి.

* * *

మూడు రోజుల క్రితం ఫ్యాక్టరీ మంచి పట్టించు కొచ్చిన బియ్యాపు

మూట, తెచ్చిపెట్టినప్పుడు ఎక్కడ ఉన్నదో మూడు రోజుల తర్వాత కూడా అక్కడే ఉండటం చూచి ఆశ్చర్యంగా 'యిదేమిటి జానకీ, యిది యిన్ని రోజు ల్నించి యిక్కడే ఉంది' అని అడిగాడు రామారావు.

'ఏమో బాబు, ఆ ఎద్దు మూటను ఎవరు మోస్తారు? నేను మోయలేను'' అంది జానకి.

పాపం రామారావే చెమటలు కక్కుకుంటూ ఆ మూటను క్రింద పడేసి ఈడ్చుకుంటూ గుమ్మాలు దాటించి వంటింట్లోకి చేరవేసి, ఫేన్ పెట్టుకుని కుర్చీలో కూర్చుని హాయిగా ఏదో నవల చదువుకుంటున్న జానకిని చూచి పళ్ళు పటపట కొరికాడు—

* * *

'ఈ పిల్ల ఎవరు?'

'పనిపిల్ల'

'ఎందుకు'

'ఎందుకేమిటి? నీళ్ళ తోడటానికి—అంట్లు తోమటానికి, బట్టలు ఉతకటానికి'

'నీవు......నీవు చేసుకోవా?'

'ఎవరు చేస్తారు బాబు ఆ మోటు పనులన్నీ—పది రూపాయలు పారేస్తే పనిపిల్ల వస్తుంటే'—

'పదా!!'

* * *

'రోజూ ఎందుకు జానకి యిన్నేసి మల్లెపూలు—'

'మల్లెపూలంటె నా కెంత యిష్టమో! మల్లెపూలని ప్రేమించలేనివారు ఇంకెవర్నీ ప్రేమించలేరు—మీరన్నదేగా!'

'అవుననుకో......ఈవేల మొత్తం మీద యీ మల్లెపూలకోసం ఆరు రూపాయలా అరవై రెండు పైసలయ్యాయి—' అనుకుంటూ అన్నాడు రామారావు.

'పూరికే రావుగా'

* * *

డాబామీద వెన్నెట్లో తన వడిలో పడుకుని చుక్కల్ని లెక్కపెట్టుతున్న జానకితో 'యిక లేచి వంట ప్రయత్నం చేయకూడదు?' అన్నాడు రామారావు.

'యింత చక్కటి వెన్నెలను వదలి ఆ సెగలో వంట ఎవరు చేస్తారు. ఈపూటకి కారియర్ తెప్పించుకుందాం లెండి—'

'నెలాఖరు రోజులు—కారియర్‌కు రూపాయిన్నర కావాలి'—

''పర్వాలా—వెధవ రూపాయిన్నర. అమావాస్య రోజుల్లో వెన్నెల కావాలని ఎన్ని లక్షలు గుమ్మరిస్తేమాత్రం వస్తుంది?''

సరిగ్గా రోగడ ఒకసారి రామారావు అన్నాడు!

* * *

'పదిహేను రూపాయల బిల్లు చేతికిస్తూ డాక్టరేమన్నాడో తెలుసా. నీ విలా రోజు రోజుకీ చిక్కిపోవటానికి నీ ఒంట్లో చెప్పుకోదగ్గ రోగమేమీ లేదనీ, నీవు సరిగ్గా తిండి తినకపోవటమే కారణమనీ అన్నాడు. కాకపోయినా మరీ అంత నాజూకు తిండి తింటే బ్రతికేది ఎలాగు జానకీ!'

'అందుకని బకాసురుడి చెల్లెలులాగా కంచాలకు కంచాలే ఎగర గొట్టేయమన్నారా ఏమిటి?'

* * *

ఆ నెలలో వచ్చిన జీతం చాలక ఆఫీసు ప్యూను దగ్గర బేడ వడ్డీకి పాతిక రూపాయలు అప్పు చేసిన రామారావు ఈమధ్య భార్యమీద కొత్తరకం సణుగుడు మొదలు పెట్టాడు.

ఆ సణుగుడులోని మచ్చు తునకలు—

''పుట్టింటినుంచి లక్షలకొద్దీ తెచ్చి పడేసినట్లు వెధవ దర్జా—ఛీ, ఛీ, ఈ ఆడవాళ్ళ మరీ యింత నాజూకుగా ఉండకూడదు — యింటిపనులు చేసుకోవటానికి యింత నామోషీ ఎందుకో— వంటావార్పూ చూసుకోకుండా పొద్దస్తమానం పగటి కలలు కనే ఈ జబ్బు ఎట్లా వచ్చిందో!'' ●


కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి



# "మేల్‌మాయిల్ మందు"

నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందువల్ల ఏర్పడు పుండ్లు, సణుగు పుట్టించు రణములు మొదలగు

*దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి*

— వివరములకు —

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P. O.) N. A. Dt.



